క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేత శంకర్‌రెడ్డికి నివాళి



పాకాల: మండలంలోని సామిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత శంకర్‌రెడ్డి(63) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం రాత్రి గ్రామానికి చేరుకున్నారు. శంకర్‌రెడ్డి భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శంకర్‌రెడ్డి ఎంతో కష్టపడ్డారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభులను పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అదేవిధంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, హరికృష్ణారెడ్డి, గోపి, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



రామచంద్రాపురం: మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లి సమీపంలో గల ద్రౌపది సమేత ధర్మరాజులు ఆలయంలో 57వ మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులోభాగంగా ఆదివారం దుర్యోధనుని వధ ఘట్టాన్ని కళాకారులు ప్రదర్శించారు. దుర్యోధనుడు, భీముడి పాత్రధారులు మునిరత్నం, దొరస్వామి అద్భుతంగా ప్రదర్శించారు. మధ్యాహ్నం భాగవతారిణి సీతాలక్ష్మీ దుర్యోధనుని వధ హరికథను గానం చేశారు. అనంతరం వందలాది మంది భక్తులు గోవిందనామ స్మరణ నడుమ అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు, అర్చకులు హరిఆచారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్ కక్ష సాధింపు చర్య

తిరుపతి కల్చరల్: మాజీ సీఎం చంద్రబాబునాయుడును అరెస్ట్ విధానం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం రాజకీయక కక్ష సాధింపు చర్యగా భావిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆయన ఆదివారం తిరుపతి సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్కాం జరిగి ఉంటే చట్ట పరంగా విచారణ చేపట్టి నిగ్గుతేల్చాలని, దీన్ని తాము స్వాగతిస్తామన్నారు. చంద్రబాబు అరెస్ట్ తీరులో పోలీసులు వ్యవహరించిన శైలి సరి కాదన్నారు. చంద్రబాబు అరెస్ట్‌లో కేంద్ర ప్రభుత్వం సహకారం కూడా ఉందని తెలిపారు. చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో సంఘీభావం తెలిపేందుకు వెళుతున్న పవన్ కల్యాణ్‌ను అడ్డుకోవడం విడ్డూరమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై సోమవారం నాడు విజయవాడలో అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం చేపట్టి తద్వారా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: కొత్త వీధిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు తెలిపారు. ఆయన ఆదివారం ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 15న అమ్మవారికి దీక్షాబంధన అలంకరణ, 16న మీనాక్షి, 17న రాజరాజేశ్వరి, 18న కామాక్షి అమ్మవారు, 19న ధనలక్ష్మి, 20న సరస్వతి, 21న మహిషాసుర మర్దిని, 22న శక్తిపూజ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. పాలక మండలి అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చట్టం అందరికీ సమానమే..

చట్టం అందరికీ సమానమేనని భారత రాజ్యాంగం చెబుతోంది. అది ఇప్పుడు మరోసారి రుజువైంది. చంద్రబాబునాయుడు అధికారాన్ని అడ్డు పెట్టుకుని అనేక స్కాములకు పాల్పడ్డాడు. వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ తప్పించుకుంటూ వచ్చాడు. అలా ఎల్లప్పుడూ జరగదు. తప్పు చేసిన వాడు తప్పించుకోలేడని తేలిపోయింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడంపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

తప్పు చేశాడు కాబట్టి శిక్ష తప్పదు



చట్టం ముందు అందరూ సమానులే అని ఏసీబీ కోర్టు తీర్పు మరోసారి రుజువు చేసింది. వ్యవస్థలను మేనేజ్ చేసుకోవచ్చని చంద్రబాబు భావించారు. ప్రాథమిక ఆధారాలు ఉన్నందువల్లే కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును ప్రజాస్వామ్యవాదులు ఆహ్వానించక తప్పదు. అధికారం ఉంటే ఏం చేసినా చెల్లుతుందన్న వాదన ఈ తీర్పుతో రాజకీయ నాయకుల్లో తొలగిపోయింది.

–టి.దాసు, దళిత సంఘాల నాయకుడు, తిరుపతి

చట్టానికి ఎవరూ అతీతులుకాదు



చట్టానికి ఎవరూ అతీతులు కాదని చంద్రబాబుకి కోర్టు విధించిన రిమాండ్ రుజువు చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో సీఐడీ పోలీసులు దాఖలు చేసిన రిమాండ్ నివేదికలో ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయన్న అంశాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడికి ఏసీబీ న్యాయస్థానం రిమాండ్ విధించింది. చట్టం తనపని తాను చేసుకుపోతుందని, నేరానికి పాల్పడిన ఎంత పెద్ద వారినైనా చట్టం వదలిపెట్టదని స్పష్టమైంది. చంద్రబాబు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దారి మళ్లించి నేర కుట్రకు పాల్పడ్డారు.

–దొరబాబు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు

అమరావతి భూముల పైన లోతైన విచారణ జరగాలి



అమరావతి భూములు, అక్కడి రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పుపై లోతైన విచారణ జరపాలి. విద్యార్థులను టార్గెట్ చేసి స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో మాయ చేశారు. పిల్లల భవిష్యత్తుతో ఆడుకున్న చంద్రబాబుకు ఎంత శిక్ష వేసినా తక్కువే. అధికారాన్ని అడ్డం పెట్టుకుని తప్పులు చేసే వారికి ఏదో ఒక రోజు శిక్ష తప్పదు. ఈ కేసులో కూడా చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేయాలని చేసిన ప్రయత్నం విఫలమైంది.

–అక్కినపల్లి లక్ష్మయ్య, రజక సంఘం రాష్ట్ర నాయకుడు

అన్ని కేసులను వెలికి తీయాలి



నేను నిజాయితీపరుడిన అని చంద్రబాబు స్వతహాగా కప్పుకున్న ముసుగు ఎట్టకేలకు తొలగింది. దశాబ్దాలుగా వ్యవస్థలను మేనేజ్ చేస్తూ చట్టానికి చిక్కకుండా తప్పించుకుంటూ వచ్చాడు. ఇప్పటికే అనేక కేసులు విచారణకు నోచుకోకుండా స్టేలతో నెట్టుకొస్తున్నాడు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుతోపాటు స్టేలు ఉన్న కేసులన్నింటిని వెలికితీయాలి. తప్పు చేసినవాడు శిక్ష అనుభవించక తప్పదు. చంద్రబాబు నిప్పు అయితే అన్ని కేసులపై విచారణ కోరాలి.

–శంకర్ నాయక్, ఎస్టీ కమిషన్ స్టేట్ మెంబర్

నూతన దంపతులకు హర్షిత్‌రెడ్డి శుభాకాంక్షలు

పాకాల: మండలంలోని దామలచెరువు రెడ్డెప్పరెడ్డి కల్యాణ మండపంలో ఒక్కటైన నూతన దంపతులు రెహమాన్, రిహానాకు ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆదివారం దామలచెరువుకు చేరుకుని విందులో పాల్గొన్నారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మాజారెడ్డి, నంగా నరేష్‌రెడ్డి, నంగా బాబురెడ్డి, రహీం, కపిలేశ్వర్‌రెడ్డి, అల్తాఫ్, మల్లికార్జున, శివప్రసాద్, మోహన్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



పెళ్లి విందులో పాల్గొన్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

వేడుకగా కామాక్షి అమ్మవారి ఉత్సవర్ల కుంభాభిషేకం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని యోగిమల్లవరంలో వెలసిన కామాక్షి సమేత పరాశరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వేడుకగా కామాక్షి అమ్మ ఉత్సవర్లకు మహా కుంభాభిషేకం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, రెండో కాలయాగ సాల పూజ నిర్వహించారు. తదుపరి అమ్మవారికి పట్వార్చన, ప్రాణ ప్రతిష్ట నామకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయ ప్రదక్షిణంగా తీసుకొని వచ్చి స్నపన తిరుమంజనం చేశారు. ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ప్రోద్బలంతో ఈ క్రతువులు అప్రతిహతంగా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమాన్ని ఈవో మమత పర్యవేక్షించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఎంపీ గురుమూర్తి, తెలంగాణ ఎంపీ సంతోష్ కుమార్, ఎంపీ చింతా అనూరాధ, ప్రభుత్వ విప్ కొరుముట్ల శ్రీనివాసులు, సినీ దర్శకుడు రాఘవేంద్రరావు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

శ్రీశశి గణేశ స్కాన్స్ అండ్ డయాగ్నొస్టిక్స్ ప్రారంభం

తిరుపతి కల్చరల్: తిరుపతి కోటకొమ్మల వీధిలో ఏర్పాటు చేసిన శ్రీశశి గణేశ స్కాన్స్ అండ్ డయాగ్నొస్టిక్స్‌ను ఆదివారం టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలతో శ్రీశశి గణేశ స్కాన్స్ అండ్ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ప్రారంభించడం శుభపరిణామమన్నారు. సెంటర్ అధినేతలు డాక్టర్ శశికళ, గణేష్‌కుమార్‌ను ఆయన అభినందించారు. డాక్టర్ శశికళ మాట్లాడుతూ అన్ని రకాల ఎంఆర్ఐ, సిటీ 3డీ/4డీ అల్ట్రా సౌండ్, మాస్టర్ హెల్త్ చెకప్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, తిరుపతి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కేవీ.చౌదరి, మధుసూదన్‌రావు శ్రీశశిగణేశ స్కాన్స్ అండ్ డయాగ్నొస్టిక్స్ సెంటర్ అధినేతలను అభినందించారు.



డయాగ్నొస్టిక్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉంది

తిరుపతి కల్చరల్: మతోన్మాదం పేరుతో దేశాన్ని విభజించాలని ప్రయత్నిస్తున్న వారి నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి విద్యార్థులు, యువతపై ఉందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ తెలిపారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక తరగతులు ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేడు ఢిల్లీలో జరుగుతున్న జీ–20 దేశాల సదస్సు, అంతకుముందు జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సు, జీ–7 దేశాల సదస్సులో ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం కోసం జరిగినవేనన్నారు. ఆయా దేశాల్లో పేద, బడుగు, బలహీన వర్గాలు, విద్యార్థి, నిరుద్యోగులు, రైతులు, కార్మికుల గురించి ఆలోచించడం లేదన్నారు. భారత దేశం నేడు ధనిక, పేద అనే రెండు భాగాలుగా విడిపోయిందన్నారు. పాలకులు తమ స్వలాభం కోసం తెస్తున్న చట్టాలు, నినాదాలను వాటి వెనుక ఉన్న ఉద్దేశాలను అర్థం చేసుకోవాలన్నారు. కర్ణాటక విద్యార్థి సంఘటన రాష్ట్ర నేత మనోజ్ అజాద్ సోషల్ మీడియా ప్రభావం– ఫలితాలు– యాప్స్ ప్రయోగాలు– సద్వినియోగం పద్ధతి గురించి వివరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, అధ్యక్షుడు భూషణం మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక తరగతులు ఆశించిన దానికన్నా ఎక్కువగా విజయవంతం అయ్యాయని తెలిపారు. ఈ స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు రూప కల్పన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు మహర్షి, రాజేష్, నాని, మహేంద్రబాబు, ధనశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా జననాయక పార్టీ రాష్ట్ర కమిటీ ఎంపిక

తిరుపతి కల్చరల్: ఇండియా జననాయక పార్టీ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రవి పచ్చముత్తు తెలిపారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



తిరుపతి మంగళం: మంగళం సప్తగిరినగర్ పంచాయతీ సప్తగిరికాలనీకి చెందిన నూతన వధువు శ్రీఅభినయకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని శనివారం ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుడు మహ్మద్‌ఖాశీమ్ బాష, వార్డు మెంబర్లు మురగ, మహేశ్వరరెడ్డి, మంజుల, మల్లెల నాగరాజు, రమేష్ అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుచానూరుకు చెందిన శివనాట్య కళా నిలయం, నాట్య గురువు సంధ్య ఆధ్వర్యంలో కళాకారులు యువదర్శిని, మహాలక్ష్మి, తన, మోక్ష, నిఖిత, స్ఫూర్తి, చాందిని, చార్వి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వారిని ఏవో ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి రూరల్: జూనియర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(జేసీఐ) వారోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుపతి రూరల్ మండలం ఓటేరులో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని జేసీఐ జోనల్ ప్రెసిడెంట్ జెఎస్ఎస్ వర్మ ప్రారంభించారు. కంటి, డయాబెటిస్, డెంటల్, ప్రసూతి వైద్య నిపుణులతో పాటు ఆయుర్వేద వైద్యులు 203 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ తిరుపతి అధ్యక్షుడు గుణశేఖర్, ప్రతినిధులు జయలక్ష్మి, తహసిన్‌బేగం, హర్షవర్ధన్‌రెడ్డి, భరత్, రాజారెడ్డి, కృష్ణ, ఇస్మాయిల్, సూర్యకిరణ్ పాల్గొన్నారు.

కళల వికాసంతోనే సమాజ శ్రేయస్సు

తిరుపతి కల్చరల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం పట్టే కళల వికాసంతోనే సమాజ శ్రేయస్సు ముడిపడి ఉంటుందని పలువురు వక్తలు తెలిపారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో చేపడుతున్న జాతీయ సంగీత, సాహిత్య, నృత్యోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం రాత్రి నిర్వహించిన పురస్కారాల ప్రదానోత్సవంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పారిశ్రామికవేత్త పీసీ.రాయులు, రంగస్థలి వ్యవస్థాపక అధ్యక్షుడు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ ప్రతినిధి వైఎస్.బాబు, జోష్ ప్రాపర్టీస్ ఎండీ అరూరు ఈశ్వర్‌ప్రతాప్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అనంతరం కళాపోషలకులు, సమాజ సేవలకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. శాంతిమోహన్‌కు నాట్య విద్వన్మణి, ఎన్‌బీ.హర్షవర్ధన్‌రెడ్డికి విశిష్ట సేవా పురస్కారం, కళాకారుడు మునస్వామికి సేవారత్న పురస్కారం ఎస్.భవితశ్రీకి నాట్యతరంగిణి, వరంగల్‌కు చెందిన కె.అనన్య, హనుమకొండకు చెందిన చందన, అనపర్తికి చెందిన హిరణ్యారెడ్డికి నాట్యరంజిత పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి కేఎన్.రాజా పాల్గొన్నారు.



నాట్య రంజిత పురస్కారాలతో కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

పోటీల్లో ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి సిటీ: ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ప్రథమ ఏడాది బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ విద్యార్థులకు ఆంగ్లభాషా సామర్థ్యాన్ని పెంచి ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను పెంపొందించాలని కాన్ఫ్లుయన్స్ పేరిట వినూత్న కార్యమాన్ని నిర్వహించారు. ఇందులో టాక్ ది టాక్ లిజన్ ఆఫ్, ఫిక్షన్ డిక్షన్, ఇన్క్ క్రాఫ్ట్ పోటీలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమరాల్డ్స్ డైరెక్టర్లు విశ్వనాథ్, గిరిధర్ విచ్చేసి నిర్వాహకులను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలుగా లిజన్ ఆఫ్‌లో ప్రతిభ(బీకాం), నిఖిత(బీబీఏ), టాక్ ది టాక్‌లో పూజశ్రీ(బీబీఏ), కె.పవన్(బీకాం), ఫిక్షన్ డిక్షన్‌లో శరణ్‌హని(బీఎస్సీ), క్రిష(బీబీఏ), ఇన్క్‌క్రాఫ్ట్‌లో లలిత(బీసీఏ), దేవిశ్రియ(బీసీఏ) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం, జానకిరామ్, శ్రీనివాసులు, నాదముని, పార్థసారధి, ప్రిన్సిపాల్ జాఫర్, అధ్యాపకులు, గ్రేస్ వినీల, అమ్మాజి, వసుంధర, సుధాకర్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతగా గెలుపొందిన విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు